నిర్లక్ష్యానికి నిదర్శనం

- పొదలు, చెట్ల మధ్య పాఠశాలలు –కార్యాలయాలు
- అధ్వానంగా పరిసరాలు.. పట్టించుకోని అధికారులు



రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్ల మధ్య గిరిజన ప్రాథమిక పాఠశాల వెనుక భాగం



శిథిలావస్థకు చేరిన రాజవొమ్మంగి పశువుల ఆస్పత్రి



గిరిజన ప్రాథమిక పాఠశాల పైకప్పుపై అల్లుకున్న చెట్ల కొమ్మలు

రాజవొమ్మంగి: ఎక్కడైనా బడి అంటే ప్రాంగణంలో అందమైన పూల మొక్కలు, ఆహ్లాదకరమైన వాతావరణం గుర్తుకు వస్తుంది. కాని అందుకు భిన్నంగా రాజవొమ్మంగిలో మాత్రం కొన్ని పాఠశాలలు ఊడల మర్రి చెట్లక్రింద, అడవిని తలపించే పొదల మాటున ఉన్నాయి. పాఠశాలల చుట్టు పొడైన భవనాలు, పెంట కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఏ వైపు నుంచి ఏ విషసర్పం వస్తుందోనని పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఈ పాఠశాలల్లో చదువుకొంటున్నారు. పాఠశాల ప్రాంగణం చుట్టూ ఉన్న వాతావరణం భయం గొల్పేలా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇదే తీరులో మండలకేంద్రంలోని పలు ప్రభుత్వ భవనాలు దర్శనమిస్తున్నాయి. వీటి నిర్వహణ పర్యవేక్షణలను అధికారులు విస్మరించడంతో ఈ భవనాలు దారుణంగా మారాయి. రాజవొమ్మంగి ఎంపీడీవో కార్యాయం వద్ద గిరిజన ప్రాథమిక పాఠశాల పెద్ద ఊడలమర్రి నీడలో ఉంది. ఆ చెట్టునుంచి వచ్చిన ఊడలు, చెట్టు కొమ్మలు పాఠశాల గదుల్లోకి చొరబడి భీతి గొల్పుతున్నాయి. ఈ పాఠశాలపై ఎత్తుగా ఉన్న పెద్ద చెట్టు వర్షాలకు, గాలులకు ఎప్పుడు కూలిపోతుందోనని పిల్లలు బిక్కు బిక్కు మంటూ ఇక్కడ చదువుకొంటున్నారు. ఇదే ప్రాంగణంలో గల భవిత ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాల కూడా ఉంది. అయినా పరిసరాలు భయంగొల్పేలా ఉండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిని ఇక్కడి వారు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గల వెటర్నరీ ఆసుపత్రి పై దాదాపు రెండేళ్ల క్రితం పెద్ద చెట్టు కూలిపోయింది. అసలే శిథిలావస్థలో ఉన్న ఈ భవనం చెట్టుకూలిపోవడంతో మరింత పాడైంది. వర్షం వస్తే లోనికి వర్షం నీరు కారుతు ఇక్కడ భద్రపరిచే పశువులకు చెందిన వ్యాక్సినేషన్లు పాడైపోతున్నాయి. రాజవొమ్మంగి శివారు అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న స్త్రీశిశుసంక్షేమశాఖ భవనం (ఐసీడీఎస్ కార్యాలయం) కూడా పూర్తి శిథిలస్థితికి చేరుకొని, వర్షం వస్తే కారిపోతు నిలువనీడ లేకుండా కనుపిస్తోంది. ఈ కార్యాలయంలో నిల్వ చేసే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు చెందిన పౌష్టికాహార కిట్లు తడిసిపోతున్నాయి. దీంతో పోషకాహారకిట్లు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలు, కార్యాలయాల పరిసరాలను బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



సచివాలయం భవనం ప్రాంగణంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు



సూరంపాలెం ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఈఓ బ్రహ్మాజీరావు(ఫైల్)

పాఠశాల నిర్వహణపై డీఈవో ఆగ్రహం

రాజవొమ్మంగి పంచాయతీలోని సూరంపాలెంలోని ప్రాథమిక పాఠశాలను డీఈఓ పి.బ్రహ్మాజీరావు బుధవారం సందర్శించారు. కాగా ఈ పాఠశాల పాంగణంలో బలసిన పిచ్చిమొక్కలను చూసి ఆయన అసహనం వ్యక్తం చేశారు. పిచ్చిమొక్కలను తొలగించి పూల మొక్కలు, కూరగాయాల మొక్కలు పెంచాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు.

క్లుప్తంగా

సస్యరక్షణతో అధిక దిగుబడులు



గెంజిగెడ్డలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మధుసూదనరావు

చింతపల్లి: వరిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి టి.మధుసూదనరావు అన్నారు. చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గెంజిగెడ్డ గ్రామంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వరి పంటలో కలుపుతీత, ఆశించే తెగుళ్ల వాటి నివారణ చర్యలను వివరించారు. అదే విధంగా ప్రతి రైతు విధిగా ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. వీహెచ్ఏ శోభన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏడీగా కిశోర్ బాధ్యతల స్వీకరణ



పెదబయలు: పెదబయలు పశుసంవర్థక శాఖ ఏడీగా డాక్టర్ నాతి కిశోర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విశాఖపట్నంలో పని చేసి ఏడీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏడీగా పనిచేసిన రాజారవికుమార్ బదిలీపై వెళ్లారు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల పశుసంవర్థక శాఖ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు మండలాల పాడి పశువులకు వైద్యం అందించడంతో పాటు పాడి పశువులు, గొర్రెలు, మేకలకు సకాలంలో టీకాలు వేయాలని సూచించారు. రెండు మండలాల పరిధిలో క్షేత్ర స్థాయిలో పాడి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తామన్నారు.

హైవేపై వాహనాలు నిలిపితే చర్యలు



రాజవొమ్మంగిలో దుకాణదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ శివకుమార్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి నేషనల్ హైవేకు ఇరువైపులా ఇష్టారాజ్యంగా వాహనాలు పార్క్ చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు. గురువారం గ్రామంలోని జాతీయ రహదారికి ఇరువైపులా విచ్చలవిడిగా పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను ఆయన పరిశీలించారు. ప్రధాన రహదారిపై అస్తవ్యస్త పార్కింగ్‌తో ట్రాఫిక్‌కు ఆటంకం కలుగుతుందని ఎస్ఐ శివకుమార్ చెప్పారు. ఈ మేరకు స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. దుకాణాల వద్ద వాహనాల పార్కింగ్ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇష్టారీతిగా పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

అందుబాటులో యూరియా

అడ్డతీగల: అడ్డతీగల సొసైటీ ద్వారా రైతులకు శుక్రవారం నుంచి యూరియా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు సొసైటీ సీఈవో మణిరాజు తెలిపారు. 25 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు బుర్లె హరిబాబు సూచనల మేరకు రైతులు తమ ఆధార్ కార్డు, పాస్‌బుక్, ఒన్‌బి జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకుని యూరియా కొనుగోలు చేయవచ్చన్నారు.ఒక్కో రైతుకు ఒక్క బ్యాగ్ యూరియా మాత్రమే అందజేయనున్నట్టు తెలిపారు.

రాజవొమ్మంగి: మండలంలోని 50 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించి, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాడేరు రూరల్: మండల కేంద్రంలో సీపీఎం నాయకుల సమావేశం గురువారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులను తక్షణమే ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని, గిరిజనులతో పాటు అన్ని వర్గాల ప్రజలంతా కలిసికట్టుగా దీన్ని అడ్డుకునేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.హైడ్రో పవర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈనెల 22న సీలేరులో జీపు జాత ప్రారంభమై, 27న మజ్జివలసలో ముగుస్తుందన్నారు. అనంతరం ఈనెల 27న మజ్జివలసలో చేపట్టనున్న భారీ బహిరంగ సభకు అందరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు దాసు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



వంతాల-బంగారుమెట్ట మార్గంలో బురదలో నిలిచిపోయిన టిప్పర్

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీ కేంద్రం నుంచి బంగారుమెట్ట మార్గంలో రోడ్డు పనులు చేయకపోవడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి పనులకు కాంట్రాక్టర్ గత కొన్ని నెలలు క్రితం మట్టిని తవ్వి వదిలేయడంతో మార్గం బురదమయంగా మారింది. వర్షాలు కురుస్తుడడంతో ప్రమాదభరితంగా తయారైంది. చిత్తడి దారిపై ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. వాహనాలు జారిపడి వాహనచోదకులు తీవ్ర గాయాలపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంగారుమెట్ట గ్రామానికి వెళ్లే మార్గంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఉండటం వలన జీపులు, మినీ టిప్పర్లు వంటి వాహనాలు బురదలో చిక్కుకుపోవడంతో గంటల తరబడి ప్రయాసపడి బయటకు రావాల్సివస్తోందని ఆవేదన చెందుతున్నారు. వస్తుంది. ఈ మార్గం మీదుగా రాకపోకలకు వంతాల, పెదలోచలి, సొలభం, గడుతూరు పంచాయతీల ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టి బంగారుమెట్ట రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీలో తలపడుతున్న విద్యార్థులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు గురువారం నిర్వహించారు. అరకులోయ బ్లాక్ పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆర్ఐటీఐ, దండకారణ్య జూనియర్ కళాశాలలకు చెందిన 130 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీ బాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, హ్యాండ్‌బాల్ తదితర పోటీలను పీడీ ఎస్.అప్పారావు, ఎల్.జ్యోతి, అధ్యాపకుడు వి.కామేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించినట్లు జిల్లా యువజన విభాగ అధికారి జి.మహేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు వై.విజయలక్ష్మి, పి.నాగబాబు, ఎం.అనితకుమారి అతిథులుగా హాజరయ్యారు. పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేస్తామని యువజన విభాగ అధికారి మహేశ్వరరావు తెలిపారు.

అధికారులను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు



ఎంపీడీవో రమణను కలిసిన నేతలు

గూడెంకొత్తవీధి: ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రమణ, ఎస్ఐ సురేష్, తహసీల్దార్ అన్నాజీరావులను గురువారం గూడెంకొత్తవీధి వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.పలు ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారికి ఇక్కడ పరిస్థితులను వివరించారు. ఆయా అధికారులను కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, వైస్ ఎంపీపీ దేముడు, దామనాపల్లి ఎంపీటీసీ సభ్యుడు కొర్రా భీమరాజు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చిట్టిబాబు, యూత్ అధ్యక్షుడు బాబీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, మండల పార్టీ కార్యదర్శి లక్ష్మణ్, పీసా కమిటీ కార్యదర్శి గెమ్మెల కోటిబాబు తదతరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



అడ్డతీగలలో మానవహారంగా ఏర్పడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు



కమలబంధ గ్రామంలో తాగునీటి ట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరి



గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

డుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కమలబంధ గ్రామంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సుధతో కలిసి ఎంపీపీ బాకా ఈశ్వరి గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. మహిళా పోలీసు నాగ సుమాంజలి, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ నాయకుడు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: స్థానిక ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో ఎంఈవో పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాల తరగతి గదులు శుభ్రంగా ఉంచుకోవడం, ప్రాంగణంలో మొక్కలు నాటడం, నీటి పొదుపు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అనంతరం ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు.

'చలో పాడేరు మెడికల్ కాలేజ్'ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు చాణిక్య, అశోక్

అరకులోయటౌన్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న 'చలో పాడేరు మెడికల్ కాలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు రేగం చాణిక్య, అశోక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్టంలో నూతన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పాడేరులోని మెడికల్ కళాశాల వద్ద శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి పార్టీశ్రేణులు, అభిమానులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం



ఈఈ గాబ్రియేల్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ టి.గాబ్రియేల్ గురువారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రధాన విద్యుత్‌లైన్ మరమ్మతు పనులతో పాటు వైర్లపై చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపడుతుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చింతపల్లిలో రేపు

చింతపల్లి: చింతపల్లి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పి.వేణుగోపాలరావు తెలిపారు. చింతపల్లిలోని 33 కేవీ ఫీడర్ లైను మరమ్మతు పనుల నేపథ్యంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని అన్ని గ్రామాలకు 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నదానంలో భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని షిర్డీ సాయి బాబా మందిరంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు మందిరానికి తరలివచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. అన్న సమారాధనకు విశాఖకు చెందిన భక్తులు దేవనగేష, అలేఖ్య దంపతులు విరాళం అందజేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు చెప్పారు. సాయంత్రం బాబాకు ప్రత్యేక పూజలు, హారతి, భజన నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు



ప్రిన్సిపాల్, డాక్టర్ చిట్టబ్బాయి

పాడేరు రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టబ్బాయి చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో బీఏ, బి.కాం, బీఎస్సీ గ్రూపుల్లో అర్హులైన వారు ప్రవేశాలు పొందాలని మరిన్ని వివరాలకు కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విద్యారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



డుంబ్రిగుడలో మాట్లాడుతున్న నాయకులు

డుంబ్రిగుడ: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న ఉత్తరాంధ్ర శ్రీకాకుళం జిల్లా నుంచి యూటీఎఫ్ చేపట్టిన రణభేరి జాత గురువారం డుంబ్రిగుడ చేరుకుంది.

ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కిషోర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు కల్పించమని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీలను అమలుపరచకుండా విస్మరిస్తుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించేందుకు యూటీఎఫ్ పోరాటం సాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ప్రతి ఒక్కరు స్పందించి పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్వరరావు, రఘునాథ్, కన్నయ్య, బాలకృష్ణ, తదితరలు పాల్గొన్నారు.

బైరాగికి ఘన నివాళి



గుమ్మా బైరాగి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరకు ఎంపీ తనుజారాణి, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తదితరులు

హుకుంపేట: మండలంలోని అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యామ్‌సుందర్ తండ్రి, అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి తాతయ్య గుమ్మా బైరాగి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం అడ్డుమండలో సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డాక్టర్ తనుజారాణి, వినయ్ దంపతులు అరుకు, పాడేరు మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి బాగ్యలక్ష్మి, డా.నర్సింగరావు తంపతులు హాజరై బైరాగి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరమార్శించారు. ఎంపీ తనూజారాణి మాట్లాడుతూ తాను ఉన్నత చదువులు అభ్యసించేందుకు తన తాతయ్య బైరాగి, తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహించారన్నారు. పలువురు రాజకీయ నేతలు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్



మామిడిపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

చింతపల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు విధిగా వేయించాలని లోతుగెడ్డ పశువైద్యాధికారి డాక్టర్ సౌజన్య అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గురువారం లోతుగెడ్డ పంచాయతీ పరిధిలోని మేడూరు గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి పశువులకు టీకాలు వేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ టీకాలు వేయించడం వలన పాడి పశువుల్లో వ్యాధిని నిరోధించి పాల ఉత్పత్తిని పెంపొందించవచ్చన్నారు. గ్రామంలో 296 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామన్నారు. సర్పంచ్ చింతర్ల సునీల్, సిబ్బంది సంధ్య, మనోజ్, అరుణ, మహేష్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యభద్రత తప్పనిసరిగా పాటించాలి



డుంబ్రిగుడలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



కొయ్యూరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

డుంబ్రిగుడ/కొయ్యూరు/రంపచోడవరం/అడ్డతీగల: స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో గురువారం ఆరోగ్యభద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఇంటిల్లి పాదితో పాటు సమాజం బాగుంటుందన్నారు.మహిళలు ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలన్నారు. క్యాన్సర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించడానికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షల ద్వారా రక్తహీనత ఉంటే తక్షణమే చికిత్స పొందవచ్చన్నారు. పోషకారం ప్రాముఖ్యతపై కౌన్సిలింగ్ నిర్వహించారు. స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. డుంబ్రిగుడలో జరిగిన కార్యక్రమంలో వైద్యాధికారి రాంబాబు, సర్పంచ్ వెంకటరావు, ఎంపీటీసీ సభ్యురాలు గీత, కొయ్యూరులో వైద్యుడు హేమంత్, సీహెచ్‌వో ప్రశాంత్‌కుమార్, హెచ్‌వీ లక్ష్మీ, రంపచోడవరంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, డాక్టర్ కెవిన్, అడ్డతీగలలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ పండా సతీష్, పీడియాట్రీషియన్ హర్ష, బీజేపీ నాయకులు స్వప్న కుమారి తదితరులు పాల్గొన్నారు.



అడ్డతీగలలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



సీతపల్లిలో రోగులతో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి